

హస్మత్‌పేట చౌరస్తాలో నివాళులు అర్పిస్తున్న మాధవరం కృష్ణారావు



నివాళులర్పిస్తున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముమ్మారెడ్డి ప్రేమకుమార్



హైదర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత జగదీశ్వర్‌గౌడ్



వివేకానందనగర్ కమిటీహాల్‌లో నివాళులర్పిస్తున్న అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం



మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులో నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్



పీజేఆర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్





పీజేఆర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు జిల్లా గణేష్ నేత, కాంగ్రెస్ నాయకులు వి. జగదీశ్వర్‌గౌడ్, మారెల్ల శ్రీనివాసరావు



దయార్‌గూడలో నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకుడు సంజీవరావు



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న కో-కన్వీనర్ బుర్రి యాదగిరి



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న రిటైల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మక్కల సత్యనారాయణ, గడ్డం నర్సింగ్‌రావు



నివాళులర్పిస్తున్న బోయిన్‌పల్లికి చెందిన నాయకులు

# అంబేడ్కర్‌కు నివాళి

## అణగారిన వర్గాల్లో వెలుగులు నింపిన మహానేత అంబేడ్కర్

భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్.అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు, పలు పార్టీల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డా. బీఆర్. అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటం చేసిన గొప్ప యోధుడని కొనియాడారు. జీవితమంతా అణగారిన వర్గాల్లో వెలుగులు నింపడానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆయన త్యాగం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. డా. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకోవటమే మనం ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని తెలిపారు.

– కూకట్‌పల్లి



కూకట్‌పల్లి చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, దళిత ఐక్యవేదిక నాయకులు

## నేటి నుంచి కార్తీకమాస ప్రత్యేక పూజాలు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ మూడో రోడ్డులోని శ్రీ చక్రాధిష్టాన కామాక్షీ సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. 7వ తేదీ గురువారం బహుళ ఏకాదశి సందర్భంగా సామూహిక శ్రీరమా సమేత సత్యనారాయణస్వామి వ్రతం, 10వ తేదీన సాయంత్రం 6.30 గంటలకు శ్రీపార్వతీ పరమేశ్వరుల కల్యాణం, 11వ తేదీన మాస శివరాత్రి ఉదయం 5గంటలకు స్వామి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, 12వ తేదీన అమావస్య సాయంత్రం 6గంటలకు శ్రీకామాక్షి అమ్మవారికి లక్ష పుష్పార్చన ఉంటుందన్నారు. ప్రతి సోమవారం సాయంత్రం 6గంటలకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దామోదరుని అనుగ్రహం పొందగలరని పేర్కొన్నారు.

## టెంకాయ, టెంట్‌హౌస్ దుకాణాల అద్దెకు వేలం పాట

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని శ్రీహరిహర క్షేత్ర దేవస్థానంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు, టెంట్‌హౌస్, షామియానా సామగ్రి సరఫరా చేయుటకు బహిరంగ వేలం ఈనెల 16వ తేదీ ఉదయం 11గంటలకు ఆలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.అంజయ్య ఓ ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు, పూజాసామగ్రి గదులు కలుపుకొని డిసెంబర్ 18 నుంచి 17వ తేదీ డిసెంబర్ వరకు రూ.20వేల డిపాజిట్, టెంట్ సామగ్రి, గదులకు 3సంవత్సరాలకు డిపాజిట్ రూ.50వేలను చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు పాల్గొనవచ్చని తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో పడిపూజ



కూకట్‌పల్లి: వివేకానందనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం పడిపూజను నిర్వహించారు. అరుణ్ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన పూజలో స్వాములు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం స్వాములకు భిక్ష నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## 'మనూ'లో రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు గడువు పెంపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో దూర విద్యా కోర్సులలో ఫాలో ఆన్ కోర్సులకు నమోదు చేసుకోవడం, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు గడువు తేదీని పొడిగించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(డీడీఈ) ఫీజు పోర్టల్‌లో ఫాలో ఆన్ రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు కోసం చివరి తేదీని ఐయూఎంఎస్, సమర్థ్‌కి గడువు తేదీని డిసెంబర్ 31వరకు పొడిగించారు. బ్యాచ్, ప్రోగ్రామ్‌ల గురించిన వివరాల కోసం విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

## సీపీఆర్ పై విద్యార్థులకు అవగాహన

పటాన్‌చెరు టౌన్: నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్స్ (ఎన్బీఈఎంఎస్), ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ స్టూడెంట్స్ ఫోరమ్ (ఐపీఏ-ఎస్ఎఫ్)ల సంయుక్త సౌజన్యంతో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో బుధవారం కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) పై విద్యార్థులకు వర్చువల్‌గా శిక్షణ నిచ్చారు. సీపీఆర్ అనేది గుండె కండరాలపై ఒత్తిడి పెంచడం ద్వారా సరైన వైద్య సహాయం పొందేవరకు వ్యక్తి జీవితాన్ని నిలబెట్టడానికి ఉపయోగించే ఒక ముఖ్యమైన సాంకేతికత. శిక్షణ పొందిన వైద్యుడు సీపీఆర్ చేయడంపై వివరణాత్మక సూచనలను అందించారు.దీనిని నేర్చుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలను జారీచేశారు.ఈ ఆన్‌లైన్ సెషన్ లో గీతం ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీ.ఎస్.కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గీతంలో నార్త్ ఫ్లోరిడా విశ్వవిద్యాలయం బృందం

పటాన్‌చెరు టౌన్: నార్త్ ఫ్లోరిడా విశ్వవిద్యాలయంలోని కాలేజ్ ఆఫ్ బిజినెస్ డీన్ రిచర్డ్ బుటిమర్ బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. నార్త్ ఫ్లోరిడా విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కోర్సులు, వ్యవధి, ఫీజు, చదువుతూనే సంపాదించే అవకాశాలు, కోర్సు పూర్తయ్యాక శిక్షణ, పని చేయడానికున్న వ్యవధి, ఉద్యోగావకాశాలు తదితరాల గురించి వివరించారు. యూఎస్‌లో కెరీర్‌కు ఇవ్వాల్సిన ప్రాముఖ్యతను ఐఎంఎఫ్ఎస్ కన్సల్టెంట్ సంస్థ దక్షిణ భారత డైరెక్టర్ అజయ్‌కుమార్ తెలిపారు.

## విద్యార్థులకు 'అడ్వాన్స్ ఎక్సెల్'పై అవగాహన అవసరం

కాచిగూడ: ఎంబీఏ విద్యార్థులు అడ్వాన్స్ ఎక్సెల్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అవంతి పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ అప్పారావు అన్నారు. బుధవారం అడ్వాన్స్ ఎక్సెల్‌పై కళాశాలలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు మంచిగా చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్‌దాస్ మాట్లాడుతూ... కార్పొరేట్ కంపెనీలు, వందలాది మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఉద్యోగాల కోసం కళాశాలలో నిర్వహిస్తున్న సెమినార్‌లలో పాల్గొని సబ్జెక్టులను నేర్చుకొని మంచి కంపెనీలలో ఉద్యోగాలు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమయాన్ని వినియోగించుకుని ప్రతిభావంతులు కావాలని అన్నారు. విద్యార్థుల్లో సృజనను వెలికి తీయడానికి ఇటువంటి సెమినార్‌లు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ తబస్సుమ్, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్ట్‌టైం జాబ్ అంటూ..

- టాస్కులు, కమిషన్‌ల పేరుతో మోసం
- రూ.7 లక్షల 6 వేలు పోగొట్టుకున్న బాధితుడు
- సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.7 లక్షల 6 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని శ్రీవాణినగర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్ టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు నవంబర్ 23 న మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు.దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. ముందుగా రూ.5 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్ లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.7 లక్షల 6 వేలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదు తో పాటు కమిషన్ చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## బీసీ ఉద్యోగులకు శుభపరిణామం

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ గౌడ్ ఆయకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి రావడం తెలంగాణ బీసీ ఉద్యోగులకు శుభపరిణామమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు స్నేహపూర్వకంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు పడ్డబాధలు వర్ణనాతీతమని అలాంటి నిరంకుశ ప్రభుత్వం పోయి ప్రజాస్వామ్య కాంగ్రెస్ ప్రభుత్వం రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులందరూ సంతోషంగా ఉంటారని ఆశాభావంవ్యక్తం చేశారు. ఉద్యోగులకు బకాయిపడ్డ డీఏలు, పీఆర్సీని కొత్త ప్రభుత్వం వెంటనే విడుదల చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించి క్రీమీలేయర్ పరిమితిని పెంచాలని వారు కోరారు. సమావేశంలో సంఘం మహిళా అధ్యక్షురాలు రమ, ఉపాధ్యక్షులు సాయికిరణ్ గౌడ్, వంశీధర్, చక్రధర్, శమీమ్, రామరాజు పాల్గొన్నారు.

## 'ఇకపై సమర్థవంతమైన ప్రజాపాలన'



తెలంగాణ ప్రజావేదిక అధ్యక్షుడు బండి సదానంద్‌గౌడ్

బంజారాహిల్స్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అహర్నిశలు కృషి చేసి ప్రజాసమస్యలపై దృష్టిసారించి ప్రజల ఆదరణను చూరగొని ఎంతో కష్టపడి రేవంత్‌రెడ్డికి తెలంగాణ మూడో ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించిన ఏఐసీసీ పెద్దలకు తెలంగాణ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలంగాణ ప్రజావేదిక అధ్యక్షుడు బండి సదానంద్‌గౌడ్ తెలిపారు. బుధవారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చింది రేవంత్‌రెడ్డి మాత్రమేనని ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు ఈ విషయాన్ని గుర్తించి ఆయనను ముఖ్యమంత్రిగా ప్రకటించడం హర్షణీయం అన్నారు. రేవంత్ నేతృత్వంలో రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకెళ్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ ప్రజావేదిక కూడా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. తాము కూడా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రచారంలో నిర్వహించామని కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తాము చేసిన విజ్ఞప్తిని ప్రజలు మన్నించారన్నారు. సమర్థుడైన వ్యక్తికి రాష్ట్ర పగ్గాలు అప్పజెప్పారని అవినీతి, అక్రమాలు లేని పాలనను రేవంత్‌రెడ్డి అందిస్తారన్నారు. తెలంగాణ ప్రజావేదిక తరఫున కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రచారం నిర్వహించిన ప్రతీ ఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత సమర్థవంతమైన నాయకత్వాన్ని రేవంత్‌రెడ్డి రూపంలో చూడబోతున్నామన్నారు. ఇక నుంచి ప్రజాపాలన కొనసాగుతుందన్నారు.

## కృష్ణారావుకు శుభాకాంక్షలు



కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న బాబూరావు, సీహెచ్ ప్రభాకర్‌గౌడ్



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు, శ్రావణ్‌కుమార్

ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును పలువురు నాయకులు బుధవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ బాబూరావు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్. ప్రభాకర్‌గౌడ్‌తో పాటు నాయీ బ్రాహ్మణ సంఘం మూసాపేట సభ్యులు ఉప్పల క్రాంతిసాయి, పి. రామకృష్ణ, బాలరాజు, అమ్రేష్, భాస్కర్, జయరాంలు మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

– మూసాపేట





ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలిపిన కూకట్‌పల్లి వాసులు

## యువకుడి అదృశ్యం

మూసాపేట: మూసాపేటకు చెందిన ఓ యువకుడు తప్పిపోయిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. మూసాపేటకు చెందిన తిడేకర్ అమరేష్ (22) మానసిక దివ్యాంగుడు, మాట్లాడలేడు. ఈ నెల 4వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువుల ఇళ్లల్లో వాకబు చేసిన ఆచూకీ తెలియకపోవటంతో అతని తల్లి లక్ష్మి కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మంత్రివర్గంలో బీర్ల ఐలయ్యకు చోటు కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర మంత్రివర్గంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు చోటు కల్పించాలని యాదవ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట యాదవ విద్యావంతుల వేదిక, గొల్ల కురుమ విద్యార్థి సంఘం, బీసీ సంక్షేమ సంఘం, బీసీ జేఏసీ, ఓయూ జాక్ తదితర సంఘాల ఆధ్వర్యంలో బీర్ల ఐలయ్యను మంత్రివర్గంలోకి తీసుకోవాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకులు ఈరబోయిన నర్సింహయాదవ్, ఓయూ జేఏసీ నాయకులు డాక్టర్ ఎలేందర్‌కుర్మ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 లక్షలకు పైగా జనాభా గల యాదవులకు కాంగ్రెస్ మంత్రి వర్గంలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. గత మంత్రి వర్గంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు చోటు కల్పించిన్నట్లు కాంగ్రెస్ పార్టీ నుంచి రాష్ట్రంలో ఎన్నికైన ఏకైక యాదవ ఎమ్మెల్యే, ఉన్నత విద్యావంతుడు బీర్ల ఐలయ్యకు అవకాశం కల్పించారన్నారు.ఈ కార్యక్రమంలో జూకంటి ప్రవీణ్ కుమార్, లక్ష్మణ్‌యాదవ్, మహేందర్, పర్వతాలు, బీరప్ప, గట్టయ్య, సైదులు, పాండు పాల్గొన్నారు.

## మంత్రివర్గంలో బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ మంత్రి వర్గంలో బీసీ ఎమ్మెల్యేలకు సముచిత స్థానం కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 54 శాతం గల బీసీలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సరైన సంఖ్యలో అవకాశాలు కల్పించకుండా అన్యాయం చేసినందునే కాంగ్రెస్ పార్టీ విజయానికి బీసీలు కృషి చేశారని తెలిపారు. బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసి కుల గణను చేపట్టాలన్నారు. బీసీల ఆకాంక్షలకు అనుకూలంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేసి సరైన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలి

### న్యూఢిల్లీ సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ బృందం



అధ్యాపకులతో మాట్లాడుతున్న ఢిల్లీ బృందం

రాయదుర్గం: రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ప్రాంగణాన్ని న్యూఢిల్లీలోని సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ బృందం బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ ఆశిష్‌ధావన్, సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ శ్వేతాశర్మ, సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్ సీఈఓ విజయ్ పింగళే బృందం విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. తరగతిలో బోధనా విధానం, మౌలిక వసతులు తదితరాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. తరగతి గదిలో బోధనా విధానం, విద్యార్థులు ప్రతి అంశాన్ని ఎంతవరకు అర్థం చేసుకుంటున్నారనే అంశాన్ని పరిశీలించారు. అనంతరం హెచ్‌ఎం తాజ్‌బాబుతో సమావేశమయ్యారు. ఈ బృందం వెంట కోఆర్డినేటర్ వినాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం తాజ్‌బాబు, ఫౌండేషన్ ప్రతినిధి సురేష్ ఉన్నారు.

## బొటానికల్ గార్డెన్‌కు 2 బ్యాటరీ వాహనాలు అందజేత




అధికారులకు బ్యాటరీ వాహనాలను అందిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్‌కు ఎస్‌బీఐ గచ్చిబౌలి శాఖ అధికారులు కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రెండు గోల్ఫ్‌కార్ట్ బ్యాటరీ వాహనాలను బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ సైబరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కుమార్‌రోహిత్ మాట్లాడుతూ బొటానికల్ గార్డెన్ బాగా అభివృద్ధి చెందిందన్నారు. గార్డెన్‌ను సందర్శించే పిల్లలు, పెద్దలకు ఉపయోగకరంగా ఉండేలా వాహనాలను అందించామన్నారు. గార్డెన్‌ని బొటానికల్ ప్యారడైజ్‌గా తీర్చిదిద్దిన ఎండీ డాక్టర్ జి చంద్రశేఖర్ రెడ్డిని ఆయన అభినందించారు. అటవీ అభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ జి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే గార్డెన్‌లో 1500 రకాల అరుదైన జాతుల మొక్కలను నాటినట్లు, మరో 500 మొక్కలు నాటనున్నామన్నారు. లోటస్‌పాండ్, పర్యావరణ అధ్యయన కేంద్రం, ఆడియో వీడియో హాల్, కాక్టస్ గార్డెన్, హెర్బల్ మెడిసినల్ గార్డెన్, క్లింబర్స్, క్రీపర్స్, హెర్బ్స్, షర్బ్స్ ప్లాంట్ యొక్క ప్రయోజనాలు నక్షత్రవనం, నవగ్రహవనం, రాశివనం తదితరాల గురించి వివరించేందుకు గైడ్‌లు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ సేల్స్ మేనేజర్ ఉమాకాంత్, యోనో హైటెక్ సిటీ, గచ్చిబౌలి బ్రాంచ్ మేనేజర్ సౌజన్య, రమేష్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్, డైరెక్టర్ ఎంజేఅక్బర్, ఎకో టూరిజమ్ ప్రాజెక్ట్ మేనేజర్ సుమన్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్‌రెడ్డి, బొటానిస్ట్ డాక్టర్ వీరకిషోర్, శాంసన్‌రాజు పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో నైతిక విజయం నాదే..

- కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్
- మాజీ మంత్రి మల్లారెడ్డి కోట్లు పంపిణీ చేసి గెలిచాడు
- 150 కేసులు నమోదైన మల్లారెడ్డిపై చర్యలు తీసుకోవాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో నైతిక విజయం తనదేనని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఐదేళ్లు ఎంపీగా, మరో ఐదేళ్లు మంత్రిగా పనిచేసిన చామకూర మల్లారెడ్డి మేడ్చల్ జిల్లాలోని రైతుల భూములను అక్రమంగా ఆక్రమించి, దోచుకుని, దాచుకున్న రూ.వందల కోట్లు పంపిణీ చేసి గెలిచారని, అది గెలుపే కాదని ఆరోపించారు. బుధవారం బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి, ఓట్లు కొనుగోలు చేసి గెలిచిన మల్లారెడ్డి గెలుపు గెలుపేనా.. అని విమర్శించారు. ఆ గెలుపు ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ఈ ఎన్నికల్లో డబ్బుల పంపిణీ, బెదిరింపుల చర్యల వల్ల మల్లారెడ్డిపై 150 కేసులు నమోదయ్యాయని, ఆయన దాఖలు చేసిన అఫిడవిట్‌లో పోలీస్ కేసుల వివరాలు, ఆస్తుల వివరాలు సరిగ్గా పొందుపర్చలేదని, అందువల్ల మల్లారెడ్డిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మల్లారెడ్డి అనుచరులు మా కార్యకర్తలను కూడా బెదిరించారని ఆయన ఆరోపించారు. నీతి, నిజాయితీగా ప్రజలకు సేవచేసి ఉన్నట్లయితే మల్లారెడ్డి ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా గెలవాల్సింది అన్నారు. ఈ ఎన్నికల్లో తనకు ఓటు వేసిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఏ మాత్రం అధైర్య పడొద్దని, రాబోయే పంచాయతీ, మండల, మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం కావాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసే నిధులు, ఆరు గ్యారంటీ పథకాలను నియోజకవర్గంలోని ప్రజలకు ముందుండి అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు.